## పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి కబ్జా

**ఆక్రమణలను తొలగించి 2వేల గజాల పార్కును కాపాడిన హైడ్రా**

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

పార్కును కబ్జా చేసి.. బైనంబర్లు సృష్టించి సొంతం చేసుకునే ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. కొండాపూర్‌లాంటి ఖరీదైన ప్రాంతంలో ఏకంగా 2000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని రాఘవేంద్ర కాలనీలో పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2 వేల గజాలను లే ఔట్‌లో చూపించారు. పార్కు స్థలం ఖాళీగా కనిపించడంతో అక్కడ కొంతమంది కబ్జాకు ప్రయత్నించారు. బై నంబర్లు సృష్టించి 10 ప్లాట్లు చేసేశారు. ప్రతి ప్లాట్‌లో ఒక షెడ్డు వేశారు. ఈ విషయమై రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. దీంతో కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంగా నిర్ధారించి ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఆ వెంటనే ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటుచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పార్కు స్థలం విలువ దాదాపు రూ. 30 కోట్ల వరకూ ఉంటుందని పేర్కొన్నారు. 2000ల గజాల చొప్పున 10 ప్లాట్లుగా బై నంబర్లు సృష్టించి కబ్జా చేయడమే కాకుండా.. వాటిని రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారు. భవన నిర్మాణానికి అనుమతులు కూడా మంజూరయ్యాయి. ఇంతలో హైకోర్టు ఆదేశాలతో భవన నిర్మాణ అనుమతులను జీహెచ్‌ఎంసీ వెనక్కి తీసుకుంది. అలాగే రెగ్యులరైజేషన్‌ను కూడా రద్దు చేసింది.



పార్క్ స్థలంలో హైడ్రా బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హైదరాబాద్ వార్త

# విషాద జర్నీ..!

## -హైదరాబాద్-బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో చెలరేగిన మంటలు

**హైదరాబాద్, అక్టోబరు 24 ప్రభాతవార్త**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేటు బస్సు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ తీవ్ర ప్రమాదం అంతా ఇంతా కాదు. 19 మంది ప్రయాణికులు మృతి చెందిన ఈ ప్రమాదంలో కొందరు తృటిలోప్రాణాలతో బయపడ్డారు.అయితే,ఈ ప్రమాదంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన వారిలో సూరారం,జేఎన్‌టియూ,పటాన్‌చెరు, జెఎన్‌టియూ, మూసాపేట ప్రాంతాల నుంచి పలువురు ఉన్నారు. డ్రైవర్ల అజాగ్రత్త అనాలో..లేక ఓవర్ స్పీడ్ అనాలో తెలియదు. మల్టీ యాక్సిల్ బస్సులు పొడవు ఎత్తు కూడా ఎక్కువగానే ఉండటంవల్ల అనుకోకుండా పక్కకు ఒరిగిందంటేచాలు మొత్తం తల్లకిందు లయిపోతుంది. లిప్తపాటులోనే నిద్రమత్తులో ఉన్న ప్రయాణీకులు శాశ్వతనిద్రలోకి వెళ్లిపోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లే సుదూర ప్రాంతాల బస్సుల్లోనే జరుగుతున్నాయి. నియంత్రణ లోపమా, అవినీతి తిష్టవేయడమా లేక డ్రైవర్లకు సామర్థ్యం కొరవడటమా అన్నది ఇపుడు ఎవ్వరూ చెప్పలేని ప్రశ్నలు,. కర్నూలు వద్ద జరిగిన ప్రమాదం ఇదేకోవలోకి చెందుతుంది. లిప్తపాటులోనే బస్సులో 19మంది సజీవదహనం అయిపోయారు. మూడువేల డిగ్రీల ఉష్ణోగ్రతవద్ద వారంతా మాడిమసి అయిపోయారంటే ఆ కుటుంబాల రోదన వర్ణనాతీతం. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. మంత్రులు,ఉన్నతాధికారులు ఎంతమంది అక్కడికి వెళ్లి ఓదార్చినా వారి వేదన,మనోవ్యథ తీర్చలేని ది.రాత్రి సమయం కావడంతో ఎసి బస్సులు, టూ ప్లస్ టూ సీట్లు ఆపై బెర్త్‌లు కావడంతో చల్లటి గాలికి హాయిగా నిద్రలోకి జారుకుంటారు. ప్రయాణీకులు రోజంతా అలసి సొలసి వచ్చి ప్రయాణంలో విశ్రాంతి తీసుకునే అలవాటు 99శాతం మందికి ఉంటుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు బయలుదేరిన బస్సులో కూడా ఇదే విధంగా జరిగింది. అంతా ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు 41 మంది ప్రయాణీకులు మొత్తం 43 మంది వరకూ ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఒక డ్రైవరు పరారు కాగా మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహదారిపై బైక్‌ను బస్సు బలంగా ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది.బైక్ బస్సు కిందకు చొచ్చుకుపోయింది. బైక్‌లోని పెట్రోలు లీక్ అయి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఈ ప్రమాదం జరిగిందన్నది ప్రాథమిక సమాచారం.

**ప్రమాదాలు అర్థరాత్రుల తర్వాతనే..**

ప్రమాదాలు ఎక్కువగా అర్థరాత్రి దాటిన తర్వాత ఉదయం తెల్లవారుజాములోనే జరుగుతున్నాయి. ఎందుకంటే ఆసమయంలోనే నిద్రకు తాళలేని డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకుంటుంటారు. అందుకే ఇద్దరు డ్రైవర్లను నియమిస్తారు. అధికారులు బస్సులు బయలుదేరేముందు తనిఖీలు కూడా తప్పనిసరిచేయాలి. అలాగే మల్టీ యాక్సిల్ బస్సుల్లో అయితే ప్రమాదాల సమయంలో ఎమర్జెన్సీ ద్వారం నుండి రావడం కూడా కష్టం అవుతోంది. బస్సు ఎత్తు, పొడవు కారణంగా ప్రయాణీకులు తాము బయటకు వచ్చేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.హైదరాబాద్ నుంచి మద్రాసు, బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి, షిర్డీలకు ఎక్కువ రూట్లలో బస్సులు నడుపుతున్నారు. వీటన్నింటికీ పర్మిట్లు జారీ విధానంపై ఇప్పుడు శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది. బయలుదేరే స్థానం హైదరాబాద్ ప్రమాదాలు ఇతర రాష్ట్రాల్లో జరుగుతుండటంతో రాష్ట్రాల మద్య సమన్వయం కూడా కొరవడుతోంది. ఈ ప్రమాదాలకు అడ్డుకట్టవేయడం అటుంచి రవాణాశాఖలో వేళ్లూనుకున్న అవినీతి కూడా ఒకింత కారణం అవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిమితికి మించి ప్రయాణీకులను చేరవేస్తుండటం ప్రైవేటు ఆపరేటర్లకు అలవాటుగా మారిపోయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కర్నూలు రోడ్డుప్రమాదం ఈ నేపథ్యంలోకి రాకపోయినా డ్రైవర్ల అజాగ్రత్త లేక స్టీరింగ్ అదుపుతప్పడం వంటి కారణాలతోనే జరిగిందన్నది.అయితే హైవేల్లో ప్రయాణించే సమయాల్లో వేగం నియంత్రణ, ప్రతి వందకిలో మీటర్లకు ఒకసారి తనిఖీలు విధిగా ఉండాలన్న నిబంధనలు అమలుచేస్తేకానీ ఈ ప్రమాదాలు కొంత వరకైనా కట్టడి చేయగలుగుతారని ప్రయాణీకులు, ప్రజల్లో వినవస్తోంది.

**ఛేజింగ్ చేసి మూసాపేట్‌లో ఎక్కాడు గాయాలతో బయటపడిన బీటెక్ స్టూడెంట్..**

ప్రైవేటు బస్సు ప్రమాదంలో ఓ బిటెక్ స్టూడెంట్ గాయాలతో బతికి బయపడ్డాడు. మియాపూర్‌లో నివాసం ఉండే జయసూర్య (23) అనే విద్యార్థి ఇంటర్వ్యూ కోసం బెంగళూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తను బుక్ చేసుకున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు మియాపూర్‌లో మిస్సైంది. దీంతో ఛేజింగ్ చేసి మరీ మూసాపేటలో బస్సు ఎక్కాడు. ఉద్యోగం కోసం గంపెడా శలతో వెళ్తున్న విద్యార్థి..చివరికి ప్రమాదానికి గురయ్యాడు. ఎట్టకేలకు బతికి బయటపడ్డాడనే వార్త విని కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.కడప జిల్లా జమ్మలమడుగు మండలం నెమలిదిమ్మె గ్రామానికి చెందిన జయసూర్య,. తల్లిదండ్రులు రమాదేవి, సుబ్బారాయుడుతో కలిసి మియాపూర్ మక్త మహబూబ్‌పేట్‌లోని ప్రజా షెల్టర్ అపార్టమెంట్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఫోన్ చేశాడు జయ సూర్య. తను క్షేమంగానే ఉన్నానని..బస్సు ప్రమాదంలో తన రెండు కాళ్లకు గాయాలు అవ్వ దంతో కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నట్లు పేరెంట్స్‌కు చెప్పారు.బస్సులో నుంచి ఎలా బయట పడ్డాడో ఫోన్‌లో వివరించారు.

**బెంగళూరు నుంచి దీపావళికి హైదరాబాద్ వచ్చి...**

దీపావళి పండగకి హైదరాబాద్‌లోని మేనమామ ఇంటికి వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ మృతిచెందింది. బాపట్ల జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ధాత్రి నగరంలోని మేనమామ ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ మృతి చెదింది.



# మూడు రోజుల వ్యవధిలోనే మూడు బస్సు ప్రమాదాలు!

**హైదరాబాద్, అక్టోబరు 24 ప్రభాతవార్త**

మొన్న స్కూల్ బస్, నిన్న పెళ్లి బృందం బస్సు, తాజాగా మరో ఘోరం అనలం





ట్రావెల్స్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరగడానికి కారణమేంటి?

బస్సులో మంటలు వ్యాపించి ప్రయాణికులు సజీవ దహనమయ్యారు అనే వార్తలు తరచూ వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉరుకులు పరుగుల జీవితంలో బస్సులో సేదదీరుతూ గమ్యస్థానాన్ని చేరాలనుకునే సుదూర ప్రయాణికులు, ఊహించని ప్రమాదాల్లో శాశ్వత నిద్రలోకి వెళ్లడం ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించి వేస్తోంది.కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలతో పోలిస్తే బస్సుల్లో ప్రయాణం సురక్షితం. బస్సులు రోడ్డు ప్రమాదానికి గురైనా ప్రాణ నష్టం అత్యంత తక్కువగా ఉంటుంది. కానీ అదే అగ్ని ప్రమాదానికి గురైన సందర్భాల్లో మాత్రం ప్రాణ నష్టం ఊహకు అందడం లేదు. అసలు బస్సుల్లో అగ్నిప్రమాదాలు జరగడానికి ముఖ్య కారణాలేంటి? మంటలు శరవేగంగా వ్యాపించడానికి కారణాలేంటి? ప్రయాణికులు తేరుకునేలోగానే అగ్ని కీలలు వారిని ఏవిధంగా ముంచెత్తుతాయి? తెలుసుకుందాం..

**నెల రోజుల్లో బస్సు ప్రమాదాలివే : -**

సెప్టెంబర్ 26వ తేదీన హైదరాబాద్ నగరం నుంచి నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. మియాపూర్ నుంచి బయల్దేరిన బస్సు ఎస్సార్ నగర్ జంక్షన్‌లో ఉమేశ్ చంద్ర విగ్రహం వద్దకు రాగానేఏసీ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో ప్ర యాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. -ఈ నెల 22న హైదరాబాద్ నగరంలోని నాదర్‌గు ల్‌లోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సులో మంటలు వ్యాపించాయి. పొగలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్, బస్సును ఆపి దిగిపోయాడు. ఆ తర్వాత బస్సు పూర్తిగా దగ్ధమైంది. విద్యార్థులను ఇళ్ల వద్ద దింపి వెళ్తుండగా కాటేదాన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. -తాజాగా ఈ నెల 24వ తేదీన శుక్రవారం హైదరాబాద్ నుంచి బెంగ ళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారులో ఘోర అగ్ని ప్రమాదా నికి గురైంది. శుక్రవారం తెల్లవారుజామున జరిగి న ఈ ఘటనలో 19 మంది ప్రయా ణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 44 మంది ప్రయాణికు లు ఉన్నట్లుగా తెలిసింది. వెనక నుంచి వచ్చిన బైక్ బస్సును ఢీకొట్టిందని, కిందకు దూసుకెళ్లి డీజిల్ ట్యాంకును ఢీకొట్టడంతో మంటలు చెలరేగినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**మండే పదార్థాలు...**

బస్సుల్లో ఆయిల్, ప్లాస్టిక్ భాగాలు, రెగ్జిన్, దూది లాంటి మెటీరియల్‌తో సీట్లను తయారు చేస్తారు. ఇవి తేలికగా మంటలు అంటుకుని త్వరగా వ్యాపించేందుకు కారణమవుతాయి.

**ఫ్యూయల్ లీకేజీ...**

రోడ్డు ప్రమాదాల్లో బస్సుల్లోని ఆయిల్ ట్యాంకు, పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే పైపులు దెబ్బతిని లీకవుతుంటాయి. దీంతో అప్పటికే వేడిగా ఉన్న ఇంజిన్ భాగాలపై ఇంధనం పడి మంటలు చెలరేగుతుంటాయి.

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్...**

బస్సుల్లో టీవీ, బల్బులు, ఫ్యాన్లు, ఏసీ లాంటి విద్యుత్ ఆధారిత పరికరాలు ఎక్కువగా ఉంటాయి. నాణ్యత లేని వైరింగ్ వాడకం వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగేందుకు అవకాశం ఉంటుంది.

**అధిక వేడి...**

షార్ట్ సర్క్యూట్ తర్వాత ఎక్కువ బస్సు ప్రమాదాలు ఇంజిన్ వేడి కారణంగా జరుగుతుంటాయని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. ఇంజిన్ భాగాల వేడి కారణంగా డీజిల్, పెట్రోల్ లీకై మంటలు అంటుకుని బస్సు మొత్తాన్ని దహనం చేస్తాయని చెబుతుంటారు.

**గాలి తీవ్రత...**

బస్సుల లోపలి భాగంలో గాలి వేగం ఎక్కువగా ఉంటుంది. అనుకోకుండా ఫైర్ చెలరేగినపుడు ఈ గాలి మంటలను మరింతగా వ్యాప్తి చేయడంలో ఉపకరిస్తుంది.

అధికశాతం ప్రమాద ఘటనలకు కారణలివే...

ఇంజిన్ అధిక వేడి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, మండే పదార్థాలు, ఇంధన లీకేజీ వంటివి బస్సుల్లో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలు.

ఇక బస్సుల్లో మండే స్వభావం కలిగిన పదార్థాలతో తయారైన వస్తువులు అధికంగా ఉంటాయి. ప్రధానంగా పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనంతో పాటు ప్లాస్టిక్, రెగ్జిన్ కవర్ సీట్లు ఉంటాయి.

ఈ పదార్థాలు గాలితో కలిసి త్వరగా మంటలు అంటుకుని, వేగంగా వ్యాప్తి చెందడానికి దోహదపడతాయి.

బస్సులలో సరైన అగ్నిమాపక వ్యవస్థలు లేకపోవడం ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతోంది. అప్పటికప్పుడు మంటలు ఆర్పేందుకు తగిన వ్యవస్థ లేకపోవడం ప్రాణ నష్టానికి దారి తీస్తోంది.

**ఇరుకైన స్థలం...** బస్సులో సీట్లు మినహాయిస్తే చాలా తక్కువ స్థలం ఉంటుంది. మంటలు అంటుకున్న సమయంలో భరించలేని వేడి, పొగ ఊపిరి ఆడనివ్వకుండా చేస్తుంది. విష వాయువులు త్వరగా వ్యాపించి, ప్రయాణికులు తప్పించుకోవడానికి చాలా తక్కువ టైం ఉంటుంది.

**కిటికీలు, డోర్లు మూసుకుపోవడం...**

ప్రమాదం జరిగిన తర్వాత బస్సు భాగాలు దెబ్బతింటాయి. దీంతో ఎమర్జెన్సీ మార్గాలు, కిటికీలు దెబ్బతిని తెరుచుకునే అవకాశం ఉండదు. దీంతో ప్రయాణికులు తొందరగా బయటకు వెళ్లే మార్గాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు.

తక్షణ వ్యవస్థలు లేకపోవడం...

భవనాలు, వాణిజ్య సముదాయాల్లో మంటలు చెలరేగినప్పుడు మంటలు ఆర్పేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులు ఉంటాయి. బయట నుంచి మంటలు ఆర్పే వాయువులను పంపించడం ద్వారా మంటలను నియంత్రించవచ్చు. కానీ, బస్సుల్లో మంటలు ఆర్పేందుకు ప్రత్యేక వ్యవస్థలేమీ లేవు.

# జూబ్లీహిల్స్‌లోని ఉద్యానవనాన్ని పరిశీలించిన సీఎం

**జూబ్లీహిల్స్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 44-45లోని సినీనటుడు అల్లు అర్జున్‌కు సంబంధించిన ఎన్‌హాన్స్ భవనం పక్కన రూపుదిద్దుకుంటున్న జీహెచ్‌ఎంసీ ఉద్యానవనాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించి సందర్శించారు. ఉద్యానవనం అంతా ఆయన కలియతిరిగి అక్కడ జరుగుతున్న పనుల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులను పిలిచి వారి పరిస్థితి గురించి ఆరా తీశారు. గతంలో ఉద్యానవనం ఉన్న ప్రాంతం అంతా దుర్గంధమయంగా, చెత్తాచెదారంతో ఉండేది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ఈ ప్రాంతాన్ని పలుమార్లు గమనించారు. ముఖ్యమంత్రి అయిన అనంతరం ఈ స్థలంలో ఉద్యానవనం ఏర్పాటుకు రెండు, మూడుసార్లు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రూ. 40 లక్షల నిధులను జీహెచ్‌ఎంసీ మంజూరు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుంది. ఇక్కడ పనులన్ని దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యానవనంలో కొనసాగుతున్న పనులను పరిశీలించేందుకు సీఎం అక్కడికి వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలియజేశారు.


జీహెచ్‌ఎంసీ కార్మికులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.

# మూడు రోజుల్లో ముగ్గురు స్నేహితుల ఆత్మహత్యలు

## -అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో కలకలం


వైష్ణవి


రాకేష్


శ్రీజ

**హయత్ నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త :**

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు ఒకరి తరువాత ఒకరు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కోహెడ గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... కోహెడ గ్రామానికి చెందిన గ్యార శివరాజు కుమార్తె వైష్ణవి(18), సతాలి వెంకటేశ్ కుమారుడు రాకేష్ (21), బుద్ద నర్సింహా కుమార్తె శ్రీజ (18)లు స్నేహితులు. వారంతా 6-10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. వైష్ణవి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. మందులు వాడకపోవడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈనెల 21న సాయంత్రం ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్తామని చెప్పారు. అంతలో గదిలోకి వెళ్లిన ఆమె చీరతో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతకీ బయటకు రాకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. వైష్ణవి అంత్యక్రియలకు హాజరైన సతాలి రాకేష్ బుధవారం రాత్రి సోదరుడి షాపులో పడుకుంటానని చెప్పి వెళ్ళాడు. ఉదయం షాపులో చూడగా అతను ఫ్యాన్ కు ఉరి వేసుకుని మృతి చెంది కనిపించాడు. రాకేష్ మరణ వార్త తెలుసుకుని ఇంటికి వచ్చిన బుద్ద నర్సింహా కుమార్తె శ్రీజ గురువారం గదిలో ఫ్యాన్ కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒకరి తర్వాత మరొకరు వరుసగా మూడు రోజుల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. ముగ్గురు మృతిచెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు 4,01,365

## - తుది జాబితా విడుదల

**జూబ్లీహిల్స్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుదిజాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గతంలో నియోజకవర్గంలో3,98,982 మంది ఓటర్లుగా ఉండేది. ఉప ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు అవకాశం కల్పించడంతో 2383 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. దీంతో ఈ సంఖ్య 4,01,365కు చేరింది. ఇందులో పురుష ఓటర్లు 2,08,561మంది, 1,92,779 మంది మహిళలు, ఇతరులు 25, పోలింగ్ బూత్‌లు 407 ఉన్నట్లు తెలిపారు. ఇక తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ. 2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, రూ. 3.69 లక్షల విలువైన 512 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో నాలుగు బ్యాలెట్స్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు.

## మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి

**: కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి**




బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న మహిళలతో కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 24 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో సాయిరాంనగర్‌లో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకుని ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడడానికి ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మాల కొండయ్య, ఆర్గనైజర్లు విజయ, వనజ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**-ఎమ్మెల్యే బీఎల్ఆర్**



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, అక్టోబర్ 24 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం డివిజన్‌లో సుమారు రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు నాయకులు మక్తల్ శేఖర్ గౌడ్, సంఘం యాదగిరి, సురేందర్ గౌడ్, వెంకటరెడ్డి, విలాస్ రెడ్డి, ప్రవీణ్, రామ్ రెడ్డి, నర్సింగ్ రావు, సంతోష్, తిరుమలరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్ గౌడ్, జోగేశ్వరరావు, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్‌జోన్ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్



విద్యార్థినులకు పోలీసు విధులపై అవగాహన కల్పిస్తున్న ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి

**తార్నాక, అక్టోబర్ 24 ప్రభాతవార్త :** ఈస్ట్ జోన్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్స్ పెక్టర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ పేరుతో పోలీస్ స్టేషన్లో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు పోలీసుల విధులు, సైబర్ క్రైమ్, షీ టీమ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో ఎస్సై శోభ, ఏఎస్ఐ, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## ద్వారకామాయి సాయిబాబా పీఠంలో మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ పూజలు



సాయిబాబా పీఠాన్ని సందర్శించిన మీర్‌పేట్ ఇన్స్ పెక్టర్ శంకర్‌కుమార్ నాయక్‌ను సన్మానిస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్ రోడ్డు నెంబర్ 5లోనున్న ఆధ్యాత్మిక పీఠం శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని పవిత్ర కార్తీక శుక్రవారం సందర్భంగా స్థానిక మీర్‌పేట్ ఇన్స్ పెక్టర్ శంకర్ కుమార్ నాయక్ సందర్శించి సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త, సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ ఇన్స్ పెక్టర్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**ఉప్పల్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** ఉప్పల్ మున్సిపల్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, సిటీ న్యూరో సెంటర్ ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురికి ఉచితంగా బిపి, సుగర్, లివర్, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి రఘురాములు, కార్యదర్శి వేముల తిరుపతి రెడ్డి, జాజుల నగేష్ గౌడ్, మాదుగుల మోహన్ రెడ్డి, శాగపురం శ్రీహరి గౌడ్, పెద్దోళ్ల నాగిరెడ్డి, గరిమాజి శ్రీనివాసాచారి, గడ్డం సుబ్బా రెడ్డి, గంటా రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్ శెట్టి, మల్లా రెడ్డి, అన్య బాల కృష్ణా, వెంకటేష్, మేడిపల్లి నవీన్ చారి, పలువురు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. నడకతో పాటు శారీరక వ్యాయామం కూడా ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటీ న్యూరో సెంటర్ సిబ్బంది బి. ఇనాక్, శ్రీజ, దివ్య, శిరీష, పలువురు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

## బడంగ్‌పేట్ ఎజిఆర్ కాలనీ డ్రైనేజీ సమస్యలు తీర్చడంలో కమిషనర్ నిర్లక్ష్యం

**-రోడ్డెక్కి ధర్నా చేసిన కాలనీవాసులు..**
**కమిషనర్ సరస్వతిపై మహిళల ఆగ్రహం**



బడంగ్‌పేట్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఎజిఆర్ కాలనీవాసులు, కమీషనర్ వైఖరిపై మండిపడుతున్న మహిళలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 30వ డివిజన్ బడంగ్‌పేట్ ఎజిఆర్ (ఆశంగారి రెడ్డి) కాలనీలో డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను తీర్చడంలో స్థానిక కమీషనర్ సరస్వతి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కాలనీవాసులు రోడ్డెక్కారు. గత ఆరు నెలల నుండి కాలనీలో డ్రైనేజీ, పారిశుధ్యం సమస్యలతో తాము సతమతమవుతున్నా పట్టించుకోని కమీషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు కాలనీ సమీపంలోనున్న బడంగ్‌పేట్ ఆర్‌అండ్‌బి రోడ్డుపైకి వచ్చి బైఠాయించి ధర్నా చేశారు. ముఖ్యంగా మహిళలు కమీషనర్ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కమీషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దాదాపు ఆరు నెలల నుండి కాలనీలో నిత్యం డ్రైనేజీలు పొంగుతూ రోడ్లపైకి ప్రవహిస్తున్నాయనీ దీంతో తీవ్ర దుర్గంధంతో నరక యాతన అనుభవిస్తున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కమీషనర్‌కు ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వరలక్ష్మి వ్రతం రోజు ఈ ప్రాంతం గుండా ముక్కు మూసుకొని వెళ్ళిన కమీషనర్ కనీసం పది నిమిషాలు కూడా ఉండలేక పోయారనీ అయితే తాము కొన్ని నెలలుగా ఈ సమస్యను భరిస్తున్నా కమీషనర్ పట్టించుకోకపోవడం దారుణమని వారన్నారు. క్రమం తప్పకుండా కార్పొరేషన్‌కు ఇంటి పన్నులు చెల్లిస్తున్నా తమ కాలనీపై వివక్ష ఎందుకు చూపుతున్నారని వారు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకుంటే టాక్సులు వసూలు చేయవద్దని వారన్నారు.

**కాలనీవాసులకు బిజెపి నాయకులు సంఘీభావం**

డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలపై ఎజిఆర్ కాలనీవాసులు చేస్తున్న ఆందోళనకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు మద్దతు తెలిపిన పార్టీ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి తదితరులు కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కమీషనర్, అధికారుల తీరును వారు ఖండించారు. పది రోజుల్లో ఎజిఆర్ కాలనీ సమస్యలు తీర్చకపోతే స్థానిక కాలనీవాసులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టిడిస్తామని వారు హెచ్చరించారు.

**మేనేజర్ హామీతో ధర్నాను విరమించిన కాలనీవాసులు**

డ్రైనేజీ సమస్యలు, కమీషనర్ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ బడంగ్‌పేట్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న ఎజిఆర్ కాలనీవాసులచే మీర్‌పేట్ పోలీసులు ఆందోళన విరమింపజేయడానికి ప్రయత్నించినా వారు ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయం నుండి మేనేజర్ సంఘటనా ప్రాంతానికి వచ్చి కాలనీవాసులకు నచ్చజెప్పారు. డ్రైనేజీ సమస్యలను తీరుస్తామని హామీనివ్వడంతో వారు ధర్నాను విరమించారు.

## ఖాళీ స్థలాల కబ్జా యత్నాలపై కెఎల్ఆర్‌కు ఫిర్యాదు

**సరూర్‌నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీ లేఔట్‌లో ప్రజా అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలను కబ్జాదారుల నుండి కాపాడాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు బడంగ్‌పేట్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, 24వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కెఎల్ఆర్‌ను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో పాటు మల్లారెడ్డి ఖాళీ స్థలాల ఆక్రమణల గురించి కెఎల్ఆర్‌కు వివరించారు. లేఔట్ సమయంలో మధురాపురి, అమరావతి కాలనీలకు సంబంధించి దాదాపు 8 నుండి 10 ఎకరాల్లో ప్లాట్లు చేశారని అయితే అప్పట్లో స్థానికంగా ఉన్న బావి స్థలాన్ని లేఔట్‌లో 800 గజాలను ఓపెన్ ప్లేస్‌గా చూపించారని వివరించారు. అప్పట్లోనే సదరు స్థలాన్ని పార్కు స్థలంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారని అన్నారు. అయితే ప్రస్తుతం భూమి ధరలు పెరగడంతో కబ్జాదారులు పార్కు స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయతిస్తూ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి నెంబర్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో సదరు స్థలాన్ని కబ్జాదారుల



అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీలో ఓపెన్ స్థలాల కబ్జాల గురించి కెఎల్ఆర్‌కు వివరిస్తున్న నవారు మల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

నుండి కాపాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించే విధంగా చూడాలని కోరారు. ఈ మేరకు స్పందించిన కెఎల్ఆర్ అప్పటికప్పుడు కమిషనర్ సరస్వతికి ఫోన్ చేసి సదరు స్థలంలో తప్పుడు డాక్యుమెంట్లతో ఇంటి నెంబర్ల కోసం వచ్చే ఎలాంటి పరిస్థితుల్లో ఇవ్వవద్దని సూచించారు. అదే విధంగా ఆ స్థలాన్ని కాలనీవాసుల కోసం పార్కుగా అభివృద్ధి చేయాలని ఆయన కమీషనర్‌ను కోరారు. కాగా తమ వినతికి కెఎల్ఆర్ సానుకూలంగా స్పందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కాలనీ సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, సంతోష్‌చారి, వంశీ పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ

**మల్కాజిగిరి అక్టోబర్ 24 ప్రభాతవార్త;**
మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ సమావేశం శుక్రవారం గాంధీ పార్క్ లోని ప్రెస్ క్లబ్ లో జరిగింది. మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ 518/23 పాత కమిటీని కొనసాగించేందుకు మెజార్టీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో రానున్న రెండు సంవత్సరాలు పాటు ఇదే కమిటీ కొనసాగుతుంది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎన్. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా వై.విశాల్ యాదవ్, కోశాధికారిగా ఎం.డి. రెహమాన్, సలహాదారులుగా డి.మోహన్ రావు, జీ.సునీల్ రెడ్డి, కే.రాజేశ్వర్ రెడ్డి, బి.బిక్షపతి, టి.మాధవ రాయుడు, జి.సంగమేష్, గౌరవ అధ్యక్షులుగా డి. రవి కుమార్, ఉపాధ్యక్షులుగా, పవన్ కుమార్, మనోహర్, కె. సుబ్బారావు . కార్యదర్శులుగా లక్ష్మారెడ్డి, సుధాకర్, కుమ్మరి రాజు, కమిటీ సభ్యులుగా మహేందర్, నాగరాజు, ప్రభాకర్, ప్రశాంత్, సత్యనారాయణ, సంతోష్ కుమార్ తదితరులు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.బాలరాజు, వై.విశాల్ యాదవ్‌లు మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కృషి చేయనునట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా మల్కాజిగిరి సర్కిల్లో పని చేస్తున్నటువంటి జర్నలిస్టులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వారి సమస్య పరిష్కరించేందుకు ముందుంటామని వారు తెలిపారు. ఇప్పటికే మల్కాజిగిరిలో పని చేస్తున్నటువంటి విలేకరులకు ఈఎస్ఐ లాంటి ఆరోగ్య విధానాన్ని మొదటిసారి ప్రెస్ క్లబ్ అందించింది, అదే విధంగా ప్రమాదాలకు గురైన విలేకరులకు ఆర్థిక సహాయంగా నిలబడిందని, దీని కోసం అందరి సహాయ సహకారాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి విలేకరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర కాలనీ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్



పార్క్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం అక్టోబర్ 24,ప్రభాతవార్త :**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో 15.50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న పార్క్‌లో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ స్థలమును బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ఏఈ కార్తీక్ గారితో కలిసి పర్యవేక్షించడం జరిగింది ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత మరియు లెవెల్స్ సరి చూసుకుంటూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని, పార్కును అభివృద్ధి చేసే పనులు త్వరగా పూర్తిచేయాలని. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు మరియు ఉన్నారు.

## వేగంగా రాచెరువు సుందరీకరణ పనులు

**- పర్యవేక్షించిన మాజీ మేయర్ అజయ్ యాదవ్**

**బోడుప్పల్ ,అక్టోబర్ 24 ప్రభాతవార్త :** హెచ్ఎండిఏ నిధులతో బోడుప్పల్ నగర పాలకసంస్థ పరిధిలోని రాచెరువు పై జరుగుతున్న సుందరీకరణ, పలు అభివృద్ధి పనులను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, నగరపాలకసంస్థ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి , బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్, మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్ , బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, చీరాల నర్సింహా, జక్కా రాములు, పులకండ్ల జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకీర్ హరినాథ్ రెడ్డి , కాంగ్రెస్ నాయ కులు,తదితరులు పాల్గొని పరిశీలించారు.



బోడుప్పల్ రా చెరువు సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పోగుల నర్సింహారెడ్డి,కొత్త కిషోర్ గౌడ్ మాజీ ప్రజా

## పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ అక్టోబరు24, ప్రభాతవార్త :** పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రతి ఒక్కరూ క్యాంటిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఆధ్వర్యంలో ఆరంఘర్ బస్ స్టాప్, కాటేదాన్ సిటిజన్ కంటా వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ... పేదల ఆకలితో అలమటించకూడదని ఉద్దేశ్యంతో క్యాంటిన్‌లలో ప్రతిరోజూ ఉదయం అల్పాహారం ,మధ్యాహ్నం బోజనం అందిస్తుందని ఈ క్యాంటీన్లు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ వారి సహకారంతో నిర్వహిస్తున్నారని అన్నారు.మహిళా స్వయం సహాయక బృందాలకు ఉపాధి కల్పించడంలో మరియు ప్రజలకు తక్కువ ధరలో ఆహారం అందించడంలో ఈ క్యాంటీన్లు కీలకపాత్ర పోషింస్తున్నాయని అన్నారు.కార్యక్రమంలో అధికారులు, డివిజన్ ప్రెసిడెంట్ పార్టీ సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్,ధనంజయ్,శ్రీధర్,పాల్గొన్నారు.

## ఉపకులపతి రాజిరెడ్డికి ఘన సన్మానం

**అత్తాపూర్ అక్టోబరు24, ప్రభాతవార్త :**



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమితులై సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. దండా రాజి రెడ్డిని విశ్వవిద్యాలయ సిబ్బంది మరియు విద్యార్థులు సన్మానించారు. అనంతరం విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి అయినటువంటి డా. కె. మధుసూదన్ రెడ్డి రాసిన కంపిల్డ్ వెజిటేబుల్ సైన్స్ అనే పుస్తకాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. రాజి రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం, ఉద్యాన శాస్త్రంలో ఉన్నత చదువుల కొరకు ఎవరైతే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతారో వాళ్లకి బాగా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఇలాగా ప్రతిభని కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. భగవాన్, డీన్ హార్టికల్చర్ డా. చీనా నైక్, ఇతర విశ్వవిద్యాలయ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు



రామంతాపూర్‌లో జరిగిన గ్యార్మీ ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేత తవిడబోయిన గిరిబాబు తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్ గ్యార్మీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నేత ఎండి రఫీక్, తౌఫిక్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తవిడబోయిన గిరిబాబు, ఎస్ఐ చాంద్‌పాషా, మైనార్టీ నేతలు వాహీద్, నైముద్దీన్, అబ్దుల్ మతిన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఆనందోత్సవాలతో గ్యార్మీ వేడుకలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు టి.ప్రవీణ్‌కుమార్, ఆదినారాయణ, పలువురు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఉప్పల్ భగాయత్ ఎఇ బి.కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ శ్రీగిరికాలనీ, బీరప్పగడ్డ, బ్యాంక్ కాలనీ, ధర్మపురికాలనీ, ప్రశాంతినగర్, రాఘవేంద్రకాలనీ, ఈస్ట్ కళ్యాణపురి తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదే విధంగా ఉప్పల్ ఐడిఏ ఫీడర్ పరిధిలోని భరత్‌నగర్, బాలాజీనగర్, చైతన్యభారతి, రాజేంద్రనగర్, టివికాలనీ, గాంధీనగర్, చర్చికాలనీ, అరవింద్‌నగర్, నేతాజీనగర్, జనప్రియకాలనీ, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**రామంతాపూర్‌లో..** రామంతాపూర్ గోఖలేనగర్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ కె.లావణ్య తెలిపారు. అదే విధంగా రామంతాపూర్ ప్రధాన రహదారి, శారదనగర్, సిడిటిఐ, సిఎస్ఎఫ్ఎల్ తదితర ప్రాంతాల్లో కూడా సాయంత్రం విద్యుత్ ఉండదని తెలిపారు.

**హబ్సిగూడ పరిధిలో..** హబ్సిగూడ పరిధిలోని స్నేహనగర్, వివినగర్, జెఎస్ఎన్ కాలనీ, జిజికాలనీ, స్ట్రీట్‌నెం.8, శోభకాలనీ, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ వి.గణేష్ తెలిపారు.

**చిలుకానగర్‌లో..** చిలుకానగర్ పరిధిలోని అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ వినయ్ కుమార్‌రెడ్డి తెలిపారు.ఈస్ట్ బాలాజీ హిల్స్, బాలాజీహిల్స్, పద్మావతికాలనీ, అయ్యప్ప టెంపుల్, శ్రీనివాసకాలనీ, రోహిత్‌సాయి దెవలపర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## ఐకమత్యంతోనే బిసిలు రాజ్యాధికారాన్ని సాధించవచ్చు : నర్సింగరావు



కార్యక్రమంలో పాల్గొన్న కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**
బీసీలు ఐక్యమత్యంతో ఉంటేనే రాజ్యాధికారాన్ని సాధించగలుగుతారని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ లో జరిగిన ధర్నాలో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగరావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సిలు చైతన్యం అయితేనే రాజ్యాధికారం వస్తుందని, మనవి కానీ పార్టీ జెండాలు సిద్ధాంతాలు, పక్కన పెట్టి మేము ఎంతో మాకు అంత, మీరు ఎంతో మీకు అంత రిజర్వేషన్స్ రాజ్యాంగ ప్రకారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ గౌరవ అధ్యక్షులు దింత ఆనందం, పూస నర్సింహ బెస్త, విద్యాసాగర్, కోరంగి దుర్గరాణి, రాష్ట్ర ప్రధానకార్యదర్శులు బచ్చరబోయిన శ్రీనివాసులు యాదవ్, గోద మల్లికార్జునగౌడ్, చుక్కల సత్యనారాయణ, నక్క కాశినాథ్, పెద్దవూర బ్రహ్మయ్య, మాంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, సంత్యం రజక, గునిగంటి చంద్రశేఖర్ గౌడ్, మారోజు రాజు చారి, భరద్వాజ్, నరహరిచారి, ఆలేటి యాదగిరిసాగర్, కైరంకొండ నర్సింగ్, శ్రీకాంత్, రామచంద్రగౌడ్, సుంచు వాసు, బీసీ మేధావులు, విద్యావేత్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

## శబరిమలై తరలివెళ్లిన అయ్యప్ప భక్తులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**
అయ్యప్ప స్వామి భక్తులు పాదయాత్రతో శబరిమలకు తరలి వెళ్లారు. కొత్తపేట టెలిఫోన్ కాలనీలోని సరస్వతి ఆలయం నుండి శబరిమలై వరకు 41 రోజులపాటు నిర్విరామంగా పాదయాత్ర నిర్వహించే కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బిజెపి సీనియర్ నాయకులు వగ్గుల సత్యనారాయణ బృందం మహా పాదయాత్ర ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, వీరా రెడ్డి, తోట మహేందర్ యాదవ్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కుమార్

## చెత్త లారీల నిషేధంపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**-బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి రంగుల శంకర్**



**నేరెడ్ మెట్,జవహర్ నగర్, అక్టోబర్ 24 :ప్రభాతవార్త :** జవహర్ నగర్ బాలాజీ నగర్ ప్రధాన రహదారి గుండా డంపింగ్ యార్డ్ చెత్త లారీలు రాకుండా, పోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత డిమాండ్ చేశారు.ఈ మేరకు జవహర్ నగర్ పశ్చిమ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు వినతి పత్రం సమర్పించారు. రహదారిపై ప్రతిరోజూ వందల సంఖ్యలో చెత్త లారీలు తిరగడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (శానిటేషన్ ట్రాన్స్పోర్ట్) సి.ఎన్. రఘు ప్రసాద్‌కు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో కలికోట కమలాకర్,బీజేపీ అధ్యక్షుడు, జవహర్ నగర్ పశ్చిమ శాఖ.రాష్ట్ర బీజేవైఎం నాయకులు సంతోష్ గుప్తా, జిల్లా బీజేపీ కార్యదర్శి కుర్ర పుణ్యరాజు, జెఎంసీ బీజేవైఎం రామ్ నాయక్, ప్రధాన కార్యదర్శి వేపుల సన్నీ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్ పాశ్ కాలనీవాసులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్